

ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ, డీఎస్పీలు, సీఐలు

## పోలీసుల సైకిల్ ర్యాలీ

ఎదులాపురం, అక్టోబర్ 27 : పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పోలీసులు శుక్రవారం సైకిల్ ర్యాలీ తీశారు. ఈ ర్యాలీ కలెక్టరేట్ చౌక్, ఎన్టీఆర్‌చౌక్, బస్టాండ్ మీదుగా కిసాన్‌చౌక్, అంబేద్కర్‌చౌక్, నేతాజీ చౌక్, వినాయక్‌చౌక్ మీదుగా ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ వరకు సాగింది. 200 మంది పోలీసు సిబ్బంది, ప్రజలు, విద్యార్థులు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ డీ ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. పోలీస్ అమరవీరులను స్మరించుకుంటూ నిరంతరం ప్రజల్లో చిరస్మరణీయంగా ఉండేందుకు ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలపారు. ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినందుకు అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు వీ ఉమేందర్, పోతారం శ్రీనివాస్, సీఐలు కే సత్యనారాయణ, అశోక్, శ్రీనివాస్, సైదారావు, కే నరేశ్, ప్రణయ్ కుమార్, ఆర్ఐ సీఐలు నవీన్, టీ మురళి, కార్తిక్, రిజర్వేషన్ సిబ్బంది, సబ్ డివిజనల్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ రామకృష్ణ గ్రూప్ (TS & AP No. 1) Hyd., VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు (M/F) కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్: 5,000/-. Ph: 9281452833, 6281208600.
NT-320535

★ ఒక ప్రముఖ సర్వే సంస్థలో తెలంగాణ ఎలక్షన్ క్యాంపెయిన్ & సర్వే చేయుటకు రాజకీయ అవగాహన కలిగిన వెండార్స్ (500+టీం మెంబర్స్) కావలెను. సంప్ర: 7396856819, 7386886819.
NT-320424-All

PLOT FOR SALE

★ హైదరాబాద్, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్, కొహేడ, జనచైతన్య, బాటసింగారం శ్రీమిత్రలో ప్లాట్లు కొనబడును/ అమ్మబడును, నో Brokers. Ph: 9666912111, 7995005999.
NT-318030

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

నమస్తే తెలంగాణ

క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

GST 5% వర్తించును

91827 77676, 91827 77679

91827 77671, 91827 77677

## రూ.3 లక్షల పట్టివేత




పట్టుబడ్డ నగదు చూపుతున్న పోలీసులు

బోథ్, అక్టోబర్ 27 : బోథ్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఘన్‌పూర్ అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద శుక్రవారం రూ.3 లక్షలు పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. మహారాష్ట్ర వైపు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఇన్నోవా వాహనంను ఎస్ఎస్‌టీ టీం తనిఖీ చేయగా, నగదు దొరికిందని పేర్కొన్నారు. సరైన పత్రాలు లేకపోవడంతో వాటిని సీజ్ చేసినట్లు చెప్పారు. తనిఖీల్లో సూపరింటెండెంట్ రఘువీర్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ మోహన్, ఎక్సైజ్ కానిస్టేబుల్ రమేశ్‌నాయక్, బీఎస్ఎఫ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం

ముథోల్, అక్టోబర్ 27 : రైతు వ్యతిరేక కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను ముథోల్ మండలం ఆష్టా గ్రామంలో శుక్రవారం ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకులు దహనం చేశారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అఫ్రోజ్ ఖాన్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సురేందర్ రెడ్డి, సర్పంచ్ రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ పోతన్న యాదవ్, ముథోల్ మాజీ సర్పంచ్ అనిల్, నాయకులు మురళి, అశోక్, పోశెట్టి, సాయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ముథోల్ బీఆర్ఎస్ అభ్యర్థి విఠల్ రెడ్డి, నాయకులు


# కమలంలో కల్లోలం

- నిర్మల్ జిల్లాలో బీజేపీకి బీటలు
- తలలు పట్టుకుంటున్న నేతలు, అయోమయంలో శ్రేణులు

నిర్మల్, అక్టోబర్ 27(నమస్తే తెలంగాణ): నిర్మల్ జిల్లాలో బీజేపీ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. జిల్లాలోని ముథోల్, నిర్మల్, ఖానాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీ పెద్దలు వేసుకున్న అంచనాలు తలకిందులవుతున్నాయి. పార్టీలో మొదటి నుంచి ఉన్నవారికి, కష్టకాలంలో నమ్ముకున్న నాయకులకు కాకుండా, ప్యారాచూట్ నేతలకు పెద్దపీట వేస్తూ అసెంబ్లీ టికెట్లను కేటాయించడమే దీనికి ప్రధాన కారణంగా తెలుస్తున్నది. ముథోల్ నియోజకవర్గంలో పార్టీకి మొదటి నుంచి అండగా ఉన్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ పడకంటి రమాదేవికి కాకుండా, ఇటీవలే కాంగ్రెస్ నుంచి వచ్చి చేరిన రామారావ్ పాటిల్‌కు పార్టీ టికెట్ కేటాయించింది. పదేళ్లుగా పార్టీ కోసం కష్టపడ్డ తనను విస్మరించడంపై రమాదేవి తీవ్ర మనస్తాపానికి గురై బీజేపీకి రాజీనామా చేశారు. తన కష్టాన్ని బీజేపీ బూడిదలో పోసిన పన్నీరుగా చేసిందని ఆమె మీడియా ముందు కన్నీరు మున్నీరయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి మూడో స్థానంలో నిలిచిన రామారావ్ పాటిల్‌కు పెద్దపీట వేసి, రెండో స్థానంలో నిలిచిన రమాదేవిని పక్కన పెట్టారని కార్యకర్తలు కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తనకు అన్యాయం చేసిన బీజేపీకి గుణపాఠం చెబుతానని ఇప్పటికే రమాదేవి ప్రకటించారు. మహిళా ఓట్లే ప్రధాన ఆయుధంగా మలుచుకొని తనకు జరిగిన అన్యాయాన్ని ఇంటింటా తిరుగుతూ వివరించి, బీజేపీ అభ్యర్థి రామారావ్‌పాటిల్‌ను ఓడించాలని ఆమె కంకణం కట్టుకున్నారు. ఈ మేరకు ఆమె తానూర్ మండలంలో పర్యటిస్తూ రామారావ్ పాటిల్‌ను ఓడించాలని ప్రచారం మొదలు పెట్టారు. దీంతో ఈ సారి బీజేపీకి మహిళా ఓట్లు భారీగా గండిపడే అవకాశం ఉందంటున్నారు. అలాగే నిర్మల్‌లో సైతం ఇటీవలే కాంగ్రెస్ నుంచి వచ్చి చేరిన మహేశ్వర్ రెడ్డికే టికెట్ కేటాయించారు. అయితే మహేశ్వర్ రెడ్డి ఎప్పుడు ఏ పార్టీలో ఉంటాడో తెలియదన్న అపవాదు ఆయనపై బలంగా ఉంది. అలాగే ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండరన్న చర్చ నియోజకవర్గంలో మొదటి నుంచి ఉన్నది. ఇటీవల నిర్మల్‌లో జరిగిన దసరా ఉత్సవాల్లో వేలాది మంది భక్తుల సమక్షంలో తన అనుచర గణంతో ఉత్సవాల నిర్వాహకులతో గొడవకు దిగడం నిర్మల్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. హిందువుల పార్టీ అని పదే పదే చెప్పుకునే బీజేపీ అభ్యర్థిగా ఉంటూ, హిందువుల ముఖ్య పండుగైన దసరా వేడుకల్లో భయాందోళన వాతావరణానికి కారణమైన మహేశ్వర్‌రెడ్డి, ఆయన అనుచరుల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. ఇదిలా ఉంటే ఖానాపూర్ నియోజకవర్గంలో కూడా కాంగ్రెస్ నుంచి ప్యారాచూట్ నేత రమేశ్ రాథోడ్‌కు టికెట్ కేటాయించారు. 2018లో ఇండిపెండెంట్‌గా పోటీచేసి పెంబి జడ్పీటీసీగా గెలుపొందిన భూక్యా జానూబాయి బీజేపీలో చేరి, నాటి నుంచి పార్టీ అభివృద్ధి కోసం శ్రమించారు. ముందు నుంచి జానూబాయికే బీజేపీ టికెట్ వస్తుందని నియోజకవర్గంలో ప్రచారం జరిగింది. చివరి నిమిషంలో పార్టీ పెద్దలు ఆమెకు కనీస సమాచారం ఇవ్వకుండా ఇతర పార్టీ నుంచి వచ్చిన వారికి టికెట్ ఇవ్వడం పట్ల ఆమె బీజేపీ అగ్ర నేతలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జానూబాయికి టికెట్ రాకపోవడంతో బీజేపీ కార్యకర్తలు తీవ్ర నైరాశ్యంలో మునిగిపోయారు. తనను మోసం చేసిన బీజేపీకి రాజీనామా చేస్తానని, త్వరలోనే తన రాజకీయ భవిష్యత్తుపై స్పష్టతనిస్తానని ఆమె చెబుతున్నారు. పార్టీ సిద్ధాంతాలకు తిలోదకాలు ఇచ్చి, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి అందలం వేయడంతో జిల్లాలో బీజేపీ పరిస్థితి దయనీయంగా మారిందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

## బీజేపీకి బిగ్ షాక్

బైంసా, అక్టోబర్ 27 : నిర్మల్ జిల్లాలోనే బీజేపీకి బిగ్ షాక్ తగిలింది. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు పడకంటి రమాదేవి శుక్రవారం పార్టీకి, ప్రాథమిక సభ్యత్వానికి, జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పట్టణంలోని తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పదేండ్ల పాటు బీజేపీనిఅంటిపెట్టుకొని ఉన్న తనకు పార్టీ అన్యాయం చేసిందన్నారు. 20 ఏండ్ల నుంచి మెరుగైన సేవలు అందిస్తూ నియోజకవర్గంలోనే ఉంటున్నానని తెలిపారు. ముందుగా తెలుగుదేశం పార్టీలో పనిచేసి, 2014లో బీజేపీలో చేరి ఎమ్మెల్యేగా పోటీ చేశానని చెప్పారు., 2018లో బీజేపీ తరపున పోటీ చేసి, బీజేపీ అభ్యర్థిత్వాల్లో 5వ స్థానంలో ఉన్నప్పటికీ తనకంటే తక్కువగా ఓట్లు వచ్చిన రామారావు పటేల్‌ను బీజేపీ నాయకుడు బండి సంజయ్ ప్రజా సంగ్రామ యాత్రలోకి తీసుకవచ్చారని, 73 ఏండ్లు ఉన్న వ్యక్తికి టికెట్ ఇవ్వడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. నిన్నగాక మొన్న వచ్చిన వారికి బీజేపీ టికెట్ కేటాయించడం పార్టీ నైతికతను మార్చిందనడానికి నిదర్శనమన్నారు. అంతేగాకుండా బీజేపీ అధిష్టానం రామారావు పటేల్‌కు టికెట్ ఇచ్చినట్లు గానీ, ఇచ్చిన తర్వాత గానీ ఒక్కరు కూడా ఫోన్ చేసి పలుకరించలేదని, పైగా డబ్బులు తీసుకున్నానంటూ అబండాలు మోపుతూ ప్రచారం చేస్తున్నారని వాపోయారు. అలాంటి ప్రచారాల్లో వాస్తవం లేదని ప్రకటించారు. మనస్తాపానికి గురైన తాను పార్టీకి రాజీనామా చేస్తున్నానని, తన స్వార్థం కోసం ఎవరినీ రాజీనామా చేయాలనడంలేదని తెలిపారు. భవిష్యత్ రాజకీయ నిర్ణయాన్ని కార్యకర్తలతో సంప్రదించి ప్రకటిస్తానన్నారు. ఇందులో బీజేపీ నాయకులు, తదితరులు ఉన్నారు.



బీజేపీకి రాజీనామా చేస్తున్న జిల్లా అధ్యక్షురాలు రమాదేవి

# ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్
- ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, సీపీ, ఎస్పీలు, అధికారులతో సమావేశం

నస్పూర్, అక్టోబర్ 27 : అసెంబ్లీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. నస్పూర్‌లోని సింగరేణి అతిథి గృహంలో అదనపు డీజీపీ సంజయ్‌కుమార్ జైన్‌తో కలిసి మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్లు, సీపీ, అదనపు కలెక్టర్లు, ఎస్పీలు, డీసీపీలు, ఎన్నికల అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఈ నెల 30 వరకు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఓటరు నమోదు, పోలింగ్ శాతం పెంచేందుకు కృషి చేయాలన్నారు. నవంబర్ 30న పోలింగ్, డిసెంబర్ 3న కౌంటింగ్ జరుగుతుందని, ఎన్నికల నిబంధనలు డిసెంబర్ 5 వరకు అమల్లో ఉంటాయన్నారు. అభ్యర్థుల నామినేషన్లు స్వీకరించే సమయంలో నిబంధనలు పాటిస్తూ పూర్తిగా పరిశీలించాలని, సరిగ్గా నింపకుంటే సదరు అభ్యర్థులకు రాత పూర్వకంగా సమాచారం అందించాలని సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్, వీడియో సర్వేలెన్స్, వీడియో పరిశీలన బృందాల అధికారులు తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. శాంతి భద్రతలు కట్టుదిట్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, సువిధి యాప్‌ను నిరంతరం పరిశీలించాలని, ఎన్నికలకు సంబంధించిన నివేదికలను ప్రతిరోజూ సమర్పించాలని ఆదేశించారు. దివ్యాంగుల ఓటర్లను పోలింగ్ కేంద్రాల వారీగా మ్యాపింగ్ చేసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఆధారాలు లేని మద్యం, నగదు, ఇతర ప్రలోభ సామగ్రి లభిస్తే వెంటనే సీజ్ చేసి సంబంధిత అధికారులకు అప్పగించాలన్నారు. అనంతరం జిల్లాల వారీగా ఎన్నికల నిర్వహణపై తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు సింగరేణి అతిథి గృహం వద్ద గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం నస్పూర్‌లోని కలెక్టరేట్ కార్యాలయంలో 'నేను ఖచ్చితంగా ఓటు వేస్తాను' అనే నినాదంతో కొనసాగుతున్న కళాజాత కార్యక్రమంలో పాల్గొని మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్, రామగుండం సీపీ రెమా రాజేశ్వరి, అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్‌తో కలిసి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. నోడల్, ఎన్నికల విభాగం, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



ఎన్నికల అధికారి వికాస్‌రాజ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

### ఎన్నికల అధికారికి పుష్పగుచ్ఛం అందజేత..

నిర్మల్ టౌన్, అక్టోబర్ 27 : రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మంచిర్యాల జిల్లాలో నిర్వహించిన ఎన్నికల సమావేశానికి రాగా, నిర్మల్ కలెక్టర్ అశిష్ సంగ్వాన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల అధికారికి పుష్పగుచ్ఛం అందించి, స్వాగతం పలికారు.